చదువులు సాగేదెలా?

- ప్రభుత్వ పాఠశాలల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- మున్సిపాలిటీలో 22 మంది బదిలీ కాగా, వచ్చింది ఇద్దరే..
- నియోజకవర్గ వ్యాప్తంగా 353 పోస్టులు ఖాళీ



రాయదుర్గంలోని కూననాగప్ప మున్సిపల్ పాఠశాల



పాఠశాలలో పాఠం చెప్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యారంగానికి పెద్దపీట వేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూశారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో అధికశాతం ఉపాధ్యాయులు రాయదుర్గం ప్రాంతానికి వచ్చేందుకు విముఖత చూపినట్లు తెలుస్తోంది.దీంతో ప్రతి పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత ఉంది.

నియోజకవర్గంలోని రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు మండలాల్లో మొత్తం 322 ప్రభుత్వ పాఠశాలల్లో 17,265 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో మొత్తం 1,040 మంజూరు పోస్టులకు గాను ప్రస్తుతం 688 మంది మాత్రమే పని చేస్తున్నారు. అంటే దాదాపు 353 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని మండలాల్లోనూ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు జాయిన్ కాలేదు. ఇక్కడి నుంచి బదిలీ అయిన వారికన్నా వచ్చిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో పోస్టుల కొరత ఏర్పడింది. రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 22 మంది బదిలీ కాగా, కేవలం ఇద్దరు మాత్రమే ఇక్కడికి వచ్చారు. మండలాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. కేవలం కణేకల్లు మండలం నుంచి ఒక్కటే 98 మంది బదిలీ కాగా, 108 మంది ఇక్కడికి బదిలీపై వచ్చారు.

353 మంది టీచర్ పోస్టులు ఖాళీ:

రాయదుర్గం అర్బన్‌లో 134 ఉపాధ్యాయ పోస్టులకు గాను కేవలం 51 మంది మాత్రమే పని చేస్తుండగా 77 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాయదుర్గం మండలంలో 168 మంది ఉపాధ్యాయులకు 141 మంది పనిచేస్తుండగా, 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుమ్మఘట్ట మండలంలో 196 మంది ఉపాధ్యాయులకు 115 మంది పని చేస్తుండగా, 71 పోస్టులు ఖాళీ ఉన్నాయి. డి.హీరేహాళ్ మండలంలో 171 మంది ఉపాధ్యాయ పోస్టులకు 76 మంది పని చేస్తుండగా 95 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బొమ్మనహాళ్ మండలంలో 194 మంది ఉపాధ్యాయ పోస్టులకు 150 మంది పనిచేస్తుండగా 33 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కణేకల్లు మండలంలో 177 మంది ఉపాధ్యాయ పోస్టులకు 155 మంది పని చేస్తుండగా 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బదిలీ స్థానాల్లో చేరేందుకు విముఖత..

నియోజకవర్గంలో అధికశాతం ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో చేరేందుకు ఉపాధ్యాయులు విముఖత చూపుతున్నారు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి మొత్తం 488 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా, ఇక్కడికి బదిలీపై వచ్చిన వారి సంఖ్య కేవలం 280 మంది మాత్రమే. ఇందులో రాయదుర్గంపట్టణంలో మాత్రమే 22 మంది బదిలీపై వెళ్తే.. కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఇక్కడికి బదిలీపై వచ్చారు. గుమ్మఘట్ట మండలంలో 96 మంది బదిలీకాగా 52 మంది బదిలీపై వచ్చారు. బొమ్మనహాళ్ మండలంలో 92 మంది బదిలీ రాగా 67 మంది వచ్చి చేరారు. డి.హీరేహాళ్ మండలంలో 104 మంది బదిలీ కాగా కేవలం 51 మంది మాత్రమే బదిలీపై ఇక్కడికి వచ్చారు. కణేకల్లు మండలంలో 98 మంది ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా, 108 మంది వచ్చి చేరారు. రాయదుర్గం మండలంలో 70 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా 70 మంది ఇక్కడికి వచ్చి చేరినట్లు ఎంఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఈయూ రీజినల్ సెక్రటరీ ఖాన్



రాయదుర్గంలో ధర్నా చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేశారు. ఉదయం నుంచి ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విరామ సమయంలో డిపో గ్యారేజీ గేటు ముందు ధర్నా చేశారు. శనివారం నిరసన కొనసాగుతుందని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ వలి, రీజనల్ కార్యదర్శి పీఎస్ ఖాన్, డిపో సెక్రటరీ రామలింగప్ప తెలిపారు. నాయకులు తిప్పారెడ్డి, అరుణ్, మనోహర్, వెంకోజీ, బాబాసాబ్, ఎర్రిస్వామి, ప్రహ్లాద పాల్గొన్నారు.

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలియజేశారు. ధర్నాకు రీజినల్ సెక్రటరీ పీఎస్ ఖాన్ హాజరై మాట్లాడారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలన్నారు. ఉద్యోగులకు పెండింగ్ డీఏ బకాయి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు మురళీనాయక్, కార్యదర్శి బళ్ళారి మాబు, ఈయూ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఉదయం ఎర్రబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరయ్యారు. డిపో ప్రెసిడెంట్ వేణుగోపాల్, డిపో సెక్రటరీ విజయ్, చెన్నయ్య, గ్యారేజ్ నాయకులు ప్రతాప్, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కుందుర్పి: కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రుద్రంపల్లి,ఎనుములదొడ్డి గ్రామా ల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మెల్యేను అడిగారు. రుద్రంపల్లిలో సర్పంచ్ మహదేవమ్మ, లాయర్ లక్ష్మీకాంత, తిప్పేస్వామి, బొమ్మలింగ, తెనగల్లు లింగప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుకలు



కోటవీధిలో చమ్మాపీర్లు, లడ్డువారి పీర్ల సవారి



కరకముక్కల్లో కొలువుదీరిన పీర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలో మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం చిన్న సరిగెత్తు జరుపుకున్నారు. పట్టణంలోని చమ్మాపీర్లను లడ్డూ పీర్ల చావిడి వద్దకు సవారి జరిగింది. పీర్ల చావిడిల్లో ప్రత్యేక ఫాతేహ పఠించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చమ్మాపీర్ల చావిడి వద్ద ప్రత్యేకంగా అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అగ్నిగుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. 6న పెద్ద సరిగెత్తు , 7న జలధి, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ముజావర్లు తెలిపారు.

కొలువుదీరిన పీర్లు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు ,హావళిగి, కరకముక్కల, గడేకల్లు,పెద్ద కొట్టాలపల్లి, పాలికి తదితర గ్రామాల్లోని చావిడిలో పీర్లు కొలువుదీరాయి. శుక్రవారం పాలికిలో పీర్లు నిలిపారు. భక్తులు పీర్ల దేవుళ్లకు చక్కెర చదివింపులు చేయించారు.

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి



బెళుగుప్ప వన్నూరుస్వామి పీర్లచావడిలో కొలువుదీరిన పీర్లస్వాములు

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లోని పీర్ల చావిడిల్లో పీర్లస్వాములను శుక్రవారం కొలువుదీర్చారు. బెళుగుప్ప, ఎర్రగుడి, బూదివర్తి, శ్రీరంగాపురం, శీర్పి, జీడిపల్లి, తగ్గుపర్తి, రామసాగరం తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నారు. బెళుగుప్ప వన్నూరస్వామి పీర్లచావిడిలో శనివారం చిన్న సరిగెత్తు, సోమవారం పెద్దసరిగెత్తు, మంగళవారం జలధి ఉంటుందని ముజావర్లు, మొహర్రం సేవా కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ శివ సూచించారు.

సమాచారం అప్‌డేట్‌పై నిర్లక్ష్యం చేయొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి

కణేకల్లు: బాల సంజీవిని యాప్, పోషణ్ ట్రాకర్ యాప్‌లో అప్‌డేట్ చేసే విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్ల పనితీరు, సేవలపై సీడీపీఓ ఏ.నాగమణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండు మండలాల సూపర్‌వైజర్లతో పీడీ సమావేశం నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ వర్కర్, సూపర్‌వైజర్లు ఎఫ్ఆర్ఎస్ తప్పని సరిగా వేయాలన్నారు. చిన్నారుల గ్రోత్, టీహెచ్ఆర్, ఎంపీఆర్ పంపిణీ, గృహ సందర్శన, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల వివరాలు ఆన్‌లైన్ ఇండికేటర్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాంతకుమారి, గీత, రాజమ్మ, బీపీసీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై నిర్లక్ష్యం



ఉరవకొండ చిన్నకొండ వద్ద సేకరించిన చెత్తతో సహా రిక్షా వదిలి వెళ్లిన దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ చెత్త సేకరణపై సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో 20 కాలనీలు ఉండగా 9,755 నివాస గృహాలు ఉన్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా 36 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు. వీరికి చెత్త సేకరించేందుకు 18 రిక్షాలు ఉన్నాయి. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటా సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. సంపద తయారీ కేంద్రం పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరం ఉండటంతో రిక్షాలను అంతదూరం తీసుకెళ్లలేక గ్రీన్ అంబాసిడర్ కార్మికులు సేకరించిన చెత్తను ఒక చోట పడేస్తున్నారు. పట్టణంలో చాలా చోట్ల చెత్తను డంప్ చేయడంతో అపరిశుభ్రత నెలకొని, దుర్వాసన వస్తోంది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

శెట్టూరు : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని యాటకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను జెడ్పీ సీఈఓ పరిశీలించారు. ఆయన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గ్రామంలో సేకరించిన వ్యర్థాలను పరిశీలించారు. అనంతరం మంగంపల్లి గ్రామంలోని పలు వీధుల్లో ఆయన పర్యటించారు. వీధుల్లో నెలకొన్న అపరిశుభ్రతపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు ఊడ్వడం, ఇంటి వద్దకే వచ్చి చెత్తను రోజూ సేకరిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. దీంతో ప్రజలు తమ గ్రామంలో వారానికోరోజు లేదంటే 15 రోజులకోసారి రిక్షాల ద్వారా చెత్త సేకరిస్తున్నారని జెడ్పీ సీఈఓ దృష్టికి తెచ్చారు. దీంతో స్థానిక అధికారులపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జిలానీ బాషా , పంచాయతీ కార్యదర్శి రుద్రన్న తదితరులు పాల్గొన్నారు.

పీ-4 అమలుకు కృషి చేయాలి

రాయదుర్గంటౌన్: పీ ఫోర్ విధానం అమలుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీ- 4 విధానం, నియోజకర్గ విజన్ ప్రణాళికపై అధికారులతో చర్చించారు. స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండన్న తదితరులు పాల్గొన్నారు.

విజయనగర లా కళాశాలకు న్యాక్ గుర్తింపు

అనంతపురం: హౌసింగ్‌బోర్డులోని విజయనగర లా కళాశాలకు న్యాక్ –బి (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గ్రేడ్ దక్కింది. తెలుగు రాష్ట్రాల్లోని వర్సిటీ అనుబంధ లా కళాశాలకు ఇప్పటి దాకా న్యాక్ గుర్తింపు దక్కలేదు. న్యాక్ గుర్తింపు సాధించిన తొలి కళాశాలగా విజయనగర లా కళాశాలకు ఆ ఘనత దక్కిందని వ్యవస్థాపకులు ఆలూరి రామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. రాఘవేంద్ర పేర్కొన్నారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడం పట్ల రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రత్యేకంగా ప్రశంసించినట్లు వారు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



అంకంపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

బెళుగుప్ప: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని అధికారులు ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. అంకంపల్లి సచివాలయాన్ని ఈఓఆర్‌డీ శివరంజని, ఏపీఓ మురళీకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పల్లెవనం ప్లాంటేషన్ ను పరిశీలించారు.

ఆవుల అపహరణ

కుందుర్పి: మండలంలోని కొలమిపాళ్యం గ్రామంలో రామాంజనేయులుకు చెందిన నాలుగు ఆవులను ఎత్తుకెళ్లారు. జంబుగుంపల, నిజవల్లి, మలయనూరు, , ఎనుములదొడ్డి, బసాపురం పంచాయతీల్లో పేకాట జూదం జోరుగా సాగుతున్నా, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జూదం కోసం వచ్చిన వారే ఆవులను అపహరించి ఉంటారని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు.

రేపు 'చెట్టు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ద్విభాషా కవి జూటూరు షరీఫ్ రచించిన చెట్టు పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయభవన్‌లో జరగనుంది. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే సాహిత్య కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ హాజరవుతున్నట్లు నిర్వాహకుడు తన్నీరు నాగేంద్ర తెలిపారు.

రేపు తొలి ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి వారి ఆలయంలో ఆదివారం జిల్లా భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచే రుక్మిణీ పాండురంగ స్వామికి భక్తులతో అభిషేకం నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

గజలక్ష్మి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండు మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఎరుకుల సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శేఖర్

విడపనకల్లు: ఎరుకుల సంఘం మండల నూతన కమిటీని రాష్ట్ర కార్యదర్శి కోలగుండ్ల శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా వై.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా హనుమంతు, వై.భీంశేఖర్, గడేకల్లు వై.శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సతీష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యదర్శులుగా వైశ్య కుమార్, ఓబుళేసు, వై.కిష్టప్ప, సహాయ కార్యదర్శులుగా కుల్లాయిస్వామి, వై.వీనా, వై.గోపాల్, గౌరవ సలహాదరుగా వెంకటేశులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎరుకుల సేవా సంఘం ఉరవకొండ మండల అధ్యక్షుడు రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చికెన్ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు వీరేంద్ర, వై.హనుమంతు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ అసిస్టెంట్ మృతి



వన్నప్ప (ఫైల్)

ఉరవకొండ: గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వన్నప్ప(48) బెంగళూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఉరవకొండ మండలం వెలిగొండకు చెందిన వన్నప్ప గతంలో విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌గానూ పనిచేశారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా, డి.హిరేహాళ్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఉరవకొండ వీఆర్ఓలు, సిబ్బంది వన్నప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారంజైభీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఉరవకొండ ఇన్‌చార్జ్ రామప్ప నాయక్, రాప్తాడు ఇన్‌చార్జ్ నారాయణ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

- జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు



ఉరవకొండలో చెత్త సేకరణపై స్థానికులను ఆరా తీస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

ఉరవకొండ: ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదని, క్షేత్రస్థాయిలో దీన్ని నిర్లక్ష్యం చేయరాదని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశించారు. శుక్రవారం ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఈఓ గౌస్‌సాహెబ్‌తో కలిసి డీపీఓ పర్యటించారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలను అడిగి ఇంటింటా చెత్తసేకరణ ఎలా జరుగుతోంది? మీ ఇంటికి గ్రీన్ అంబాసిడర్‌లు ఎన్ని సార్లు వస్తున్నారని ఆయా వార్డుల్లో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డీపీఓ మాట్లాడుతూ చెత్త సేకరణ తరువాడ తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రానికి తీసుకెళ్లి వేరు చేయాలన్నారు.

ఘనంగా మన్యం వీరుడి జయంతి

ఉరవకొండ రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరామరాజు జయంతి వేడుకను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్ కళ్యాణదుర్గం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఆదినారాయణ మాదిగ, ఉపాధ్యక్షుడిగా మంజునాథ్, అధికార ప్రతినిధి వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, కార్యదర్శి అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు కదరప్ప మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్ఎంను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడిని సిబ్బంది, గ్రామస్తులు పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మారుతి, వన్నూరుస్వామి, సందీప్, నాగరాజు, జగన్, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని హులికల్లు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం పాతిరెడ్డి, పీఎస్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు నారాయణ పాఠశాల అభివృద్ధికి, పిల్లల విద్యా వికాసానికి ఎంతో తోడ్పడ్డారని గ్రామస్తులు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ రామాంజనేయులు, మల్లి, సురేష్, పుష్పరాజ్, గంగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

వజ్రకరూరు: మండల కేంద్రంలో వడ్డే లక్ష్మీకాంత్ అనే వ్యక్తిపై గురువారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన వాసు దాడి చేసి గాయపరచినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన లక్ష్మీకాంత్‌ను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై బాధితుడు లక్ష్మీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు వాడకాన్ని అరికట్టాలి



పొగాకు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : పొగాకు వాడకాన్ని అరికట్టాలని వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎస్.కోనాపురం జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ నారాయణ స్వామి మాట్లాడుతూ పొగాకు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామంలో సంతకాలు సేకరించి, ఉపాధ్యాయులకు అందించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పొగాకు నిర్మూలనపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

కూడేరు: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారిణి సాహితి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ సాహితీ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు అందించారు. సీహెచ్ఓ సరోజ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జేడీఏ కార్యాలయ ఏఓగా మునీర్

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ పరిపాలనాధికారిగా మునీర్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సుజాత ఉద్యోగ విరమణ చేశారు. కర్నూలు జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మునీర్ అహ్మద్ ఏఓగా పదోన్నతి ఇక్కడికి వచ్చారు. ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రవికుమార్, అదాంఖాన్, జిల్లా నాయకులు, ఉద్యోగులు స్వాగతం పలికారు.

